సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం ¦ 7 ¦ ఆగస్టు ¦ 2023



వీడిన స్నేహబంధం

ఏలూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ముగ్గురు తూర్పు గోదావరి జిల్లా బూరుగుపూడి వద్ద జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. 8లో



విద్యుదాఘాతంతో మృతి

బెంగాల్ నుంచి వలస వచ్చిన కూలీని విద్యుత్ తీగల రూపంలో మృత్యువు కబళించింది. పెదపాడు మండలం నాయుడుగూడెంలో ఘటన చోటుచేసుకుంది. 8లో



వైఎస్సార్‌సీపీలో చేరికలు

ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామంలో ఏడు కుటుంబాలకు చెందిన 50 మంది టీడీపీ గ్రామ నేతలు, కార్యకర్తలు ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. 8లో

న్యూస్‌రీల్

9 నుంచి 'నా మట్టి.. నా దేశం'



పి.ప్రశాంతి, కలెక్టర్

భీమవరం (ప్రకాశం చౌక్) : ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 9 నుంచి 20వ తేదీ వరకు నా మట్టి–నా దేశం, నేలతల్లికి నమస్కారం–వీరులకు వందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి ప్రకటనలో తెలిపారు. 9న ప్రధాని, ముఖ్యమంత్రి సందేశంతో పాటు అమృత్ సరోవర్ చెరువుల వద్ద స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపిక శిలాఫలకాలు ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. 10న పంచ ప్రాణ ప్రతిజ్ఞ, 11న వసుధకు వందనం పేరుతో 75 మొక్కలను నాటడం, 14న సమరయోధుల కుటుంబాల సత్కారం, 15న జాతీయ జెండా ఎగురవేసి వందన సమర్పణ చేయాలని తెలిపారు. 16 నుంచి 20 వరకు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. యువత మట్టిని సేకరించి కలశాల్లో తీసుకుని ఈనెల 27, 28 తేదీల్లో ఢిల్లీకి వెళ్లాలని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాలను అధికారులంతా సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

నేడు చేనేత దినోత్సవం

భీమవరం (ప్రకాశంచౌక్): చేనేతను ప్రోత్సహించే ఉద్దేశంతో ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని కలెక్టర్ పి.ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. చేనేత దినోత్సవాన్ని ప్రజలంతా జరుపుకోవాలని, అందరూ చేనేత దుస్తులు ధరించి చేనేత దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేయాలని కోరారు.

ఏలూరు చేరిన చంద్రబాబు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో సోమవారం పోలవరం ప్రాజెక్టు పర్యటన నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు ఆదివారం రాత్రి నగరంలోని క్రాంతి కల్యాణ మండపానికి చేరుకున్నారు. ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. చంద్రబాబు రాత్రి ఏలూరులో బస చేసి సోమవారం ఉదయం 10 గంటలకు బయలుదేరి పట్టిసీమ చేరుకుంటారు.

రాట్నాలమ్మకు విశేష పూజలు

పెదవేగి: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి పూజా టికెట్లపై రూ 45,900, విరాళాల రూపంలో రూ.26,138, లడ్డూ ప్రసాదంపై రూ.43,800, ఫొటోల అమ్మకాల ద్వారా రూ.4,750 మొత్తం రూ.1,20,588 ఆదాయం లభించినట్టు దేవస్థానం చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొత్త రేషన్ కార్డులొచ్చాయ్

- జిల్లాలో 9,372 కార్డుల మంజూరు
- ప్రజాప్రతినిధుల చేతులమీదుగా పంపిణీ
- ఇప్పటికే జిల్లాలో 5.62 లక్షల కార్డులు
- కొత్త కార్డులకు వచ్చేనెల నుంచి రేషన్

సాక్షి, భీమవరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోంది. దీనిలో భాగంగా ఎప్పటికప్పుడు రేషన్ కార్డులు మంజూరు చేస్తోంది. గతంలో రేషన్‌కార్డు పొందాలంటే ఏళ్ల తరబడి ఎదురుచూడటంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలో ప్రతి ఆరు నెలలకోసారి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నారు. వలంటీర్ల ద్వారా అర్హులతో దరఖాస్తు చేయించి కార్డులు మంజూరు చేయడంతో పాటు నేరుగా ఇంటికే తీసువచ్చి కొత్త కార్డు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా తాజాగా జిల్లాలోని 20 మండలాల్లో మంజూరైన 9,372 బియ్యం కార్డుల పంపిణీ ప్రారంభమైంది. రేషన్ కార్డు మంజూరు నిరంతర ప్రక్రియగా సాగుతుంది. కొత్తగా పెళ్లయినా దంపతులకు, ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి వేరే కాపురం పెట్టినా తక్షణం కొత్త రేషన్‌కార్డు మంజూరు చేస్తున్నారు.

డివిజన్ల వారీగా..

జిల్లాలోని 20 మండలాల్లో ప్రస్తుతం 5,62,395 రేషన్ కార్డుల ద్వారా ప్రతి నెలా 8,641 టన్నుల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అలాగే తక్కువ ధరకు పంచదార, కందిపప్పును ఇంటి వద్దే రేషన్ వాహనాల ద్వారా అందిస్తున్నారు. గతనెలలో ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 9,372 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయగా వీటి పంపిణీ ప్రారంభమైంది. భీమవరం రెవెన్యూ డివిజన్‌లో 10 మండలాలకు 4,627, నరసాపురం డివిజన్‌లో 10 మండలాలకు 4,745 కార్డులు మంజూరయ్యాయి. వీరికి వచ్చే నెల నుంచి రేషన్ అందిస్తారు.



భీమవరంలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ (ఫైల్)

మండలాల వారీగా కార్డులు

		కాళ్ల	303	తణుకు	753
భీమవరం	730	పాలకోడేరు	440	ఆచంట	333
పెంటపాడు	384	అత్తిలి	370	ఇరగవరం	359
తాడేపల్లిగూడెం	946	వీరవాసరం	297	పాలకొల్లు	620
గణపవరం	368	నరసాపురం	740	మొగల్తూరు	433
ఉండి	371	యలమంచిలి	354	పోడూరు	376
ఆకివీడు	418	పెనుగొండ	421	పెనుమంట్ర	356

గతంలో ఎదురుచూపులు



గతంలో రేషన్ కార్డు కావాలంటే ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే రేషన్ కార్డు అందజేశారు. సత్వరమే కొత్త కార్డు జారీ చేయడం చాలా ఆనందంగా ఉంది.

– కటికితల వసంతకుమార్, ఏలూరుపాడు, కాళ్ల మండలం

వచ్చేనెల నుంచి రేషన్ పంపిణీ

జిల్లాలో నూతనంగా మంజూరైన 9,372 బియ్యం కార్డుల పంపిణీ చురుగ్గా సాగుతోంది. కొత్త కార్డులు పొందిన వారికి వచ్చేనెల నుంచి ఉచితంగా బియ్యంతోపాటు తక్కువ ధరకు పంచదార, కందిపప్పు అందిస్తాం. ఇప్పటికే జిల్లాలో సుమారు 5.62 లక్షల రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులకు దాదాపు 8,641 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నాం.

– ఎస్.సరోజ, జిల్లా పౌరసరఫరాల అధికారి, భీమవరం

చంద్రబాబు కక్కుర్తితోనే పోలవరం ఆలస్యం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం రూరల్ : చంద్రబాబు కక్కుర్తి కారణంగానే **పోల**వరం **ప్రాజెక్టు ఆలస్యమైంద**ని **ఉప ముఖ్యమంత్రి** కొట్టు **సత్యనారాయణ** విమర్శించారు. మండలంలోని నందమూరులో ఆదివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కోసం ప్రత్యేక హోదాను పక్కన పెట్టారన్నారు. చంద్రబాబు కక్కుర్తిలో భాగస్వాములు రామోజీరావు, కుటుంబ సభ్యులని ఆరోపించారు. రామోజీరావు కుమారుడి వియ్యంకునికి వందల కోట్ల విలువైన పనులను నామినేషన్ పద్ధతిలో ఇచ్చారన్నారు. ఇప్పుడు పోలవరం పేరుతో చంద్రబాబు డ్రామాలు ఆడుతున్నాడన్నారు. 2019లో నదీ ప్రవాహానికి ప్రాజెక్టులో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని, అది నిర్మిస్తే గాని డ్యామ్ కట్టడానికి వీలు కావడం లేదన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి నిపుణులను రప్పించి చర్చిస్తోందన్నారు. చంద్రబాబు కారణంగా ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమైతే ఇప్పుడు సీఎం జగన్ పూర్తిచేయడం లేదంటూ ఆరోపిస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం జగన్ హయాంలో నదీ ప్రవాహం గతి మార్చి స్పిల్‌వే మీదుగా లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి మళ్లించారన్నారు. పవన్ కల్యాణ్ ద్వారా కాపు జాతిపై నేరం మోపే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నాడన్నారు. రాజకీయంగా ముందుకెళ్లే పరిస్థితిని పవన్ కోల్పోతున్నాడని, ఇలానే కొనసాగితే ఎన్నికల నాటికి పవన్ గ్రాఫ్ జీరోకి వచ్చేస్తుందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం

నేడు కుక్కునూరు మండలం గొమ్ముగూడెంలో వరద బాధితుల పరామర్శ



గొమ్ముగూడెంలో హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

కుక్కునూరు: గోదావరి వరద బాధితులను పరామర్శించేందుకు సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామానికి రానున్నారు. ఈ మేరకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఐటీడీఏ పీఓ సూర్యతేజ ఆదివారం గొమ్ముగూడెంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. బాంబు స్క్వాడ్ సిబ్బంది గ్రామంలో తనిఖీలు చేశారు. గొమ్ముగూడెం, రామచంద్రాపురం వరద ప్రభావిత గ్రామాల్లో సూపర్ శానిటేషన్ చేపట్టినట్టు డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు.

పర్యటన షెడ్యూల్ ఇలా..

ఏలూరు (మెట్రో): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 1.05 గంటలకు అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం కోతులగుట్ట నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.40 గంటలకు కుక్కునూరు మండలం గొమ్ముగూడెం హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.45 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 2.10 గంటలకు హెలీప్యాడ్ నుంచి బయలుదేరి 2.20 గంటలకు గొమ్ముగూడెం గ్రామానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2.50 గంటల వరకు వరద బాధిత నివాసిత ప్రాంతాల్లో కాలినడకన పర్యటించి, బాధితులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. మధ్యాహ్నం 2.55 గంటల నుంచి 3.25 గంటల వరకు వరద నష్టాలపై ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. అనంతరం గొమ్ముగూడేనికి చెందిన వరద ముంపు బాధితులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3.30 గంటలకు వ్యూపాయింట్ నుంచి బయలుదేరి 3.35 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో రాజమండ్రి బయలుదేరి వెళతారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దాం

కాళ్ల: టీడీపీ కంచుకోటగా చెప్పుకుంటున్న ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దామని నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. పెదఅమిరం గ్రామంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, గోకరాజు రామరాజు అధ్యక్షతన పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ శ్రేణులంతా సమన్వయంతో పార్టీ నిర్ణయించిన అధ్యక్షుడి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉండిలో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా అందరినీ కలుపుకుని వెళతానన్నారు. వారానికి రెండు రోజులు నియోజకవర్గం కోసం సమయాన్ని కేటాయిస్తామన్నారు. చంద్రబాబు పాలన అంతా కుళ్లు, కుతంత్రాలే అని.. పొత్తులు లేకుండా ఎన్నికలకు వెళ్లలేని అసమర్థుడు చంద్రబాబు అని విమర్శించారు. పవన్ కల్యాణ్‌కు ప్రజాసంక్షేమంపై చిత్తశుద్ధి లేదన్నారు. నీతిగా పనిచేస్తున్న వలంటీర్, సచివాలయ వ్యవస్థలు వద్దు అంటున్న పవన్ కల్యాణ్‌కు జన్మభూమి కమిటీలు కావాలా అని ప్రశ్నించారు. గత టీడీపీ పాలనలో ఏ పథకం పొందాలన్నా జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సి వచ్చిందని అప్పుడు పవన్ ఎందుకు ప్రశ్నించలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలు చేసి ప్రజాసమస్యలకు అనుగుణంగా నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఉండి నియోజకవర్గంలో పీవీఎల్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడానికి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ పాలనలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ బాధ్యులు గడపగడపకూ వెళ్లి ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు ప్రసంగించారు. జెడ్పీటీసీలు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, రణస్థుల కనకదుర్గ మహంకాళి, పి.లక్ష్మీ తులసి, ఎంపీపీలు పెనుమత్స విశ్వనాథరాజు, భూపతి రాజు చంటిరాజు, కటారి విజయలక్ష్మి, ఇందుకూరి శ్రీహరి రాజు, మండల కన్వీనర్లు పెనుమత్స ఆంజనేయరాజు, గుండుగోలను ధనరాజు, కటిక శ్రీదేవి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు గులిపల్లి అచ్చారావు, అనిత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పెద అమిరంలో పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిశీలకురాలు శ్రీలక్ష్మి

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన

హోం మంత్రి తానేటి వనిత



తణుకులో ఎస్సీల ఆత్మీయ సమ్మేళనంలో సంఘీభావం తెలుపుతున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రులు తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, ఎమ్మెల్యేలు

తణుకు అర్బన్ : బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తూ పేద వర్గాలకు అండగా నిలిచారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన కారుమూరితో ఎస్సీల ఆత్మీయ సమ్మేళనం, ఏఎంసీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర కేబినెట్‌లో 18 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటింటా పథకాలను చేరవేస్తున్నారన్నారు. విద్య అనే ఆయుధంతో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చనే అంబేడ్కర్ నినాదాన్ని చేసి చూపిస్తున్నారన్నారు.

దళితుల ఓట్ల కోసం చంద్రబాబు కుట్రలు

ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా, బీసీల తోకలు కట్ చేస్తానన్న చంద్రబాబు ఇప్పుడు దళితుల ఓట్ల కోసం కుట్రలు చేస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. పేదలను బలోపేతం చేసేందుకు పథకాల రూపంలో నగదు బదిలీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని చంద్రబాబు, లోకేష్ తప్పుపడుతున్నారని విమర్శించారు. ఆర్బీకేల ద్వారా జగనన్న వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు.

దాడులకు ప్రోత్సహిస్తున్న బాబు

టీడీపీ పతనాన్ని గమనించిన చంద్రబాబు దాడులకు ప్రోత్సహిస్తున్నారని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పుంగనూరులో మారణకాండ సృష్టించారని విమర్శించారు. కోవిడ్ సమయంలో కూడా జగనన్న ప్రభుత్వం పేదలకు సంక్షేమం అందించిందని, ఆ సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తోపాటు తణుకు మాజీ ఎమ్మెల్యే సైతం తెలంగాణలో తలదాచుకున్నారని దుయ్యబట్టారు. తణుకు మండలం వేల్పూరు పంచాయతీలో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అవకతవకలకు పాల్పడి రూ.1,500 కోట్లు దోచుకున్నారని విమర్శించారు. బీసీ వర్గాలకు ఏడు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం తలపెడితే కోర్టుకెళ్లి అడ్డుకున్నారని మండిపడ్డారు.

దళిత వర్గాలకు వెన్నుదన్నుగా..

దళిత వర్గాలు ఆర్థికంగా ఎదుగుతున్నాయంటే సీఎం జగన్ చలవేనని ప్రభుత్వ న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు అన్నారు. పవన్ కల్యాణ్ సైతం రానున్న ఎన్నికల్లో అధిక శాతం ఘర్షణలు జరిగే పరిస్థితి ఉందని, సిద్ధంగా ఉండాలని పిలుపునివ్వడం వారి నైజాన్ని బయటపెడుతుందన్నారు. ముందుగా నూతనంగా ఎన్నికైన ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, డైరెక్టర్లతో మంత్రులు ప్రమాణ స్వీకారం చేయించారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద్‌ప్రకాష్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, జక్కంపూడి సత్య రాజేంద్రప్రసాద్, మురాల సుధాకర్ పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళులు

ప్రజాగాయకుడు గద్దర్ మృతికి సభావేదిక, ప్రజానీకం సంతాపం వ్యక్తం చేసింది. మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో దళితవర్గాలకు చెందిన మహిళలు, ప్రజానీకం హాజరయ్యారు.



చల్లవారిగూడెంలో సహాయాన్ని అందజేస్తున్న దృశ్యం

నిర్వాసితులకు ప్రభుత్వ సాయం

జంగారెడ్డిగూడెం రూరల్: చల్లవారిగూడెం ఆర్అండ్ ఆర్ కాలనీలో నిర్వాసితులకు ఆదివారం నగదు, నిత్యావసరాలను ప్రభుత్వం అందజేసింది. గోదావరి వరదల నేపథ్యంలో శ్రీరామపురం, కరుటూరు, కొయిదా, చిగురుమామిడి, నార్లవరం గ్రామాలకు చెందిన 400 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.2 వేల నగదు, 6 రకాల కూరగాయలు, 25 కిలో బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. దీనిపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు బద్దే ప్రేమ్‌కుమార్, నాయకులు బద్దే ప్రేమ్‌కుమార్, పెరుమళ్ల నరసింహరావు, గిల్లబత్తిన వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి అంకురార్పణ

నాలుగు స్టేషన్లలో పనులకు శంకుస్థాపన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)/భీమవరం (ప్రకాశం చౌక్/తాడేపల్లిగూడెం/నరసాపురం రూరల్ : ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని నాలుగు రైల్వే స్టేషన్లలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆదివారం అంకురార్పణ జరిగింది. ఏలూరు స్టేషన్‌లో రూ.21.1 కోట్లతో చేపట్టనున్న పనులకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ శంకుస్థాపన చేశారు. ఆయనకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జెడ్పీచైర్మన్ ఘంటా పద్మశ్రీ మర్యాదపూర్వక స్వాగతం పలికారు. డీఐజీ జీవీజీ అశోక్ కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి, రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ల అభివృద్ధి అభినందనీయం

సామాన్యుడు సైతం తక్కువ ఖర్చుతో ఎక్కువ కిలోమీటర్లు ప్రయాణం చేసే అవకాశం భారత రైల్వేకి మాత్రమే ఉందని, నూతన పశ్చిమగోదావరి జిల్లాలో రూ.73.05 కోట్లతో మూడు స్టేషన్లను అభివృద్ధి చేయడం అభినందనీయమని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా స్టేషన్లలో పనులకు వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భీమవరంలో జరిగిన కార్యక్రమంలో మండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, డీఆర్వో కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేను కాపాడుకోవాలి

రైల్వే స్టేషన్ల అభివృద్ధికి పెద్దపీట వేసిన ప్రధాని మోదీకి ప్రత్యేక అభినందనలు అని, ప్రజావసరాలను తీరుస్తున్న రైల్వేను కాపాడుకుంటూ ముందుకు సాగాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. తాడేపల్లిగూడెం స్టేషన్‌లో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని బీజేపీ, ఇతర నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రూ.27.13 కోట్లతో ప్లాట్‌ఫాంల అభివృద్ధి, ప్రీమియం మాడ్యులర్ టాయిలెట్లు, వెయిటింగ్ హాలు, గ్యాంగ్‌వే, ఎస్కలేటర్లు, ఎలక్ట్రికల్ లైటింగ్ నిర్మాణాలు చేపట్టనున్నారు.



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ప్రధాని ప్రసంగం వింటున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్సీ రవీంద్ర, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, రైల్వే డీఆర్ఎం ఆనందరావు పాటిల్



భీమవరం (ప్రకాశం చౌక్) : టౌన్ స్టేషన్‌లో మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు



తాడేపల్లిగూడెం : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తదితరులు



నరసాపురం రూరల్ : శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

శుభతరుణం

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో పశ్చిమగోదావరి జిల్లా దేశంలోనే రికార్డుగా నిలిచిందని, మరెక్కడా లేనివిధంగా జిల్లాలో మూడు స్టేషన్లు ఎంపికయ్యాయని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నరసాపురంలో రూ.25.70 కోట్లతో, తాడేపల్లిగూడెంలో రూ.27.13 కోట్లు, భీమవరంలో రూ.22.13 కోట్లతో పనులు జరుగనున్నాయన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, రైల్వే అడ్వైజరీ కమిటీ బోర్డు సభ్యుడు జక్కంపూడి కుమార్ (విజయవాడ) తదితరులు పాల్గొన్నారు.

వీడిన స్నేహబంధం

- స్నేహితుల దినోత్సవం రోజున తీవ్ర విషాదం
- ముగ్గురు రామచంద్ర ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి
- మరో ముగ్గురు విద్యార్థులు క్షేమం
- తూర్పుగోదావరి జిల్లా బూరుగుపూడి వద్ద ప్రమాదం


కారు ప్రమాదం జరిగిన అయ్యన్నగళ్లు కాలువ నుంచి మృతదేహాలు వెలికితీత


మృతుడు హేమంత్ కుమార్


మృతుడు హర్షవర్ధన్


గాయపడిన ప్రణీత్, కరుకూరి హేమంత్, వంశీ

మధురపూడి/కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అందరూ కలిశారు.. మదిలో మధుర స్మృతులతో స్నేహితుల దినోత్సవం ముందు రోజు ఆనంద సాగరంలో మునిగి తేలారు. మది నిండా మధురానుభూతులతో తిరుగు పయనమయ్యారు. ఇంతలోనే అనుకోని ప్రమాదం ఆ స్నేహబంధాన్ని చిన్నాభిన్నం చేసింది.. ఆ ఆనందం కాస్తా ఆవిరైంది.. స్నేహితుల దినోత్సవం ముందు రోజు జరిగిన ఈ దుర్ఘటన అందరినీ కలచివేసింది. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. కారు పంట కాలువలోకి దూసుకువెళ్లిన ప్రమాదంలో ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు దుర్మరణం పాలైన ఘటన కోరుకొండ మండలం బూరుగుపూడి వద్ద శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది.

అసలేం జరిగిందంటే..

ఏలూరు రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో చదివే హర్షవర్ధన్ (19), తెల్లా హేమంత్ కుమార్ (19), కవిటి ఉదయ్‌కిరణ్ (20), వేమూరి వంశీ, కరుకూరి హేమంత్, పలివెల ప్రణీత్‌లు బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు కార్లలో పది మంది విద్యార్థులు అల్లూరు సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మీదుగా గుడిసె పర్యాటక ప్రాంతానికి బయలు దేరారు. మొదటి కారులో ఆరుగురు ఉన్నారు. అక్కడ ఉల్లాసంగా గడిపారు. స్నేహితులంతా కలసి ఆనందాన్ని పంచుకున్నారు. తిరుగు పయనంలో శనివారం అర్ధరాత్రి తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడి సమీపంలోని ఉన్న అయ్యగళ్లు కాలువ వద్దకు వచ్చేసరికి రోడ్డు మలుపులో కారు బ్రేక్ ఫెయిల్ అయ్యి 15 అడుగుల లోతున ఉన్న కాలువలోకి దూసుకుపోయింది. కారు అక్కడి పాత వంతెనను ఢీకొట్టి, పైకి ఎగిరి కాలువలో పడింది. ఈ ప్రమాదంలో వెనుక సీట్లో కూర్చున్న ముగ్గురు విద్యార్థులు హర్షవర్ధన్, టి.హేమంత్, ఉదయ్‌కిరణ్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కారు ముందు సీట్లో కూర్చున్న ముగ్గురు విద్యార్థులూ ప్రాణాలతో బయటపడ్డారు. ముందు డోర్ నుంచి తంగెళ్లమూడి గ్రామానికి చెందిన వంశీ, పెదవలి మండలం నడిపల్లికోటకు చెందిన కరుకూరి హేమంత్, ఏలూరుకు చెందిన పలివెల ప్రణీత్‌లు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు ఆదివారం ఉదయం మృతదేహాలను బయటకు తీశారు.

సత్యవోలు శోకసంద్రం

పెదపాడు: హేమంత్ మృతితో పెదపాడు మండలం సత్యవోలులో విషాదచాయలు అలముకున్నాయి. సరదాగా స్నేహితులతో కలిసి వెళ్లి వస్తామన్న కుమారుడి కోరికను కాదనలేక తల్లిదండ్రులు బస్సులో వెళ్లి రమ్మని చెప్పారు. కాలేజీలోని తన మిత్రులతో కలిసి మారేడుమిల్లి వెళ్లిన హేమంత్ ఇకలేడనే విషయాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. తండ్రి ఆనంద్ ఐదేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం ఏలూరులోని శివనగర్‌లో నివాసం ఉంటూ వాటర్‌ప్లాంట్ నడుపుతూ పిల్లలను చదివిస్తున్నాడు. ఇద్దరు కొడుకులను గారాభంగా పెంచి పెద్ద చేశారు. మరో రెండేళ్లలో చదువులు పూర్తయితే తనకు సాయపడతారని తండ్రి భావించాడు. రెండో కుమారుడు హేమంత్ విగత జీవిగా ఇంటికి రావడం వారిని దిగ్భ్రాంత్రికి గురిచేసింది. స్వగ్రామమైన సత్యవోలుకు బంధువులు, మిత్రులు చేరుకుని రోధించడం అందరినీ కలిచివేసింది.

బంధువుల రోదనలతో విషాదం

ప్రమాదంలో గాయపడిన వారిని, ముగ్గురి మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి ఆదివారం తీసుకొచ్చారు. గాయపడిన పి.ప్రణీత్, కె.హేమంత్, వి.వంశీలకు వైద్యులు మెరుగైన చికిత్స అందించారు. కారు నడుపుతున్న ప్రణీత్ చేయి విరిగిపోగా చికిత్స చేశారు. సీటు బెల్ట్ పెట్టుకోవడంతో ప్రణీత్ ప్రాణాలతో బయటపడ్డాడు. విద్యార్థుల కుటుంబీకులు ఆసుపత్రి వద్దకు చేరుకోవడంతో ఆ ప్రాంతంలో విషాద చాయలు అలముకున్నారు. ప్రమాదంలో మృతిచెందిన వారు ఏలూరు జిల్లా పెదపాడుకు చెందిన వీరేంద్రనాయుడు కుమారుడైన హర్షవర్ధన్, ఏలూరుకు చెందిన ఆనంద్ కుమారుడు తెల్లా హేమంత్ కుమార్, ఉమామహేశ్వరం గ్రామానికి చెందిన గోవిందరావు కుమారుడు కవిటి ఉదయ్‌కిరణ్‌గా గుర్తించారు. కష్టపడి చదువుకుని కుటుంబానికి ఆసరాగా నిలుస్తారనుకుంటే, ఇంతలోనే అనుకోని ప్రమాదం తమ ఆశలను చిదిమివేసిందని ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు పెద్దపెట్టున రోదించారు. ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతదేహాలకు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

క్లుప్తంగా

కేపీ పాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి


కేపీ పాలెం బీచ్‌లో సేదదీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి వేసవిని తలపించేలా ఎండలు కాయడంతో పర్యాటకులు సముద్రస్నానం చేస్తూ సేదదీరారు. గత వారం వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో అధికారుల ఆదేశాల మేరకు బీచ్‌కు ఎవరినీ అనుమతించలేదు. ఆదివారం ఉదయం నుంచి పర్యాటకుల రాకతో సందడి నెలకొంది. సముద్ర స్నానం అనంతరం పర్యాటకులు తీరంలోని వెంకటేశ్వర స్వామి, వేలాంకణీ మాత, పాండురంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

గద్దర్ మృతి పట్ల డిప్యూటీ సీఎం సంతాపం

మంత్రి దాడిశెట్టి రాజాకు పరామర్శ


తునిలో దాడిశెట్టి రాజా తల్లికి నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన పాట ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన చైతన్యమూర్తి గద్దర్ అని కొనియాడారు. హక్కుల కోసం, సామాన్య ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహానుభావుడని కొనియాడారు. గద్దర్ మరణం విచారకరమని చెప్పారు.

దాడిశెట్టి రాజాకు పరామర్శ

పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దాడిశెట్టి రాజాను డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆదివారం తునిలో పరామర్శించారు. దాడిశెట్టి రాజా తల్లి సత్యనారాయణమ్మ మృతి పట్ల సంతాపం తెలిపి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

మెరుగైన సమాజం కోసం పాటు పడాలి


మానవత అధ్యక్షుడు మోహనరావును అభినందిస్తున్న వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.ప్రేమచంద్రారెడ్డి

పెంటపాడు: మానవత సేవలు నిస్వార్థంగా అందిస్తూ సమాజానికి మెరుగైన సేవల కోసం పాటుపడాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి మానవత సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పెంటపాడుకు చెందిన విశ్రాంత బ్యాంక్ మేనేజర్, మానవత విద్యా కమిటీ చైర్మన్ తాడేపల్లి మోహనరావు ఎన్నికయ్యారు. ఆయన ప్రమాణస్వీకారం పురస్కరించుకొని పెంటపాడు సంగంమేడ వద్ద నిర్వహించిన సమావేశంలో రామచంద్రారెడ్డి మాట్లాడారు. పేద విద్యార్థులకు ఫీజులు కట్టడం, వ్యక్తిత్వ వికాస శిక్షణ, అనాథ మృతదేహాల సంస్కారం వంటివి చేస్తూ మానవత ఇతోధిక సాయం చేస్తుందన్నారు. మోహనరావు హయాంలో మానవత మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఉమ్మడి జిల్లా మానవత అధ్యక్షుడిగా తాడేపల్లి మోహనరావు, ఉపాధ్యక్షుడిగా పాతపాటి హరికుమార్‌రాజు, కార్యదర్శిగా కేఎస్ఎన్ మూర్తి, కోశాధికారిగా గుళ్లపూడి వెంకటరత్నం, సహాయ కార్యదర్శిగా అడుసుమిల్లి నిర్మల, ఈసీ ఎమర్జెన్సీగా వీవీ రామకృష్ణ, విద్యకు సంబంధించి జె.వెంకటేశ్వరరావు, ఈసీ అవేర్‌నెస్‌గా గట్టిం సింధు, హెల్త్‌గా మహంకాళి రంగప్రసాద్ తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో మానవత పెద్దలు ఆలపాటి నాగేశ్వరరావు, రామిశెట్టి గంగాధరరావు, సాగిరాజు జానకిరామరాజు, కండెపు సూర్యనారాయణలతో పాటు, పలు మండలాలకు చెందిన మానవత సభ్యులు పాల్గొన్నారు. మండల కార్యవర్గ సభ్యులు మోహనరావును సన్మానించారు.

గడపగడపకు సంక్షేమం


తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం నందమూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్య మంత్రి కొట్టు సత్యనారాయణ

విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి


పెదపాడు మండలంలోని సకల కొత్తపల్లిలో మృతి చెందిన అబ్దుల్ రహీమ్ కారీకర్

పెదపాడు: పొట్టకూటి కోసం బెంగాల్ నుంచి వచ్చిన అబ్దుల్ రహీమ్ కారీకర్(42)ను విద్యుత్ తీగల రూపంలో మృత్యువు కబలించింది. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపాడు మండలంలోని నాయుడుగూడెం గ్రామానికి వ్యవసాయ పనులకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఉత్తర 24 పరగణాలు రామ్‌నగర్‌కు చెందిన అబ్దుల్ రహీమ్ కారీకర్ తోటికూలీలతో వచ్చాడు. పరిసర ప్రాంతాల్లో ఉన్న రైతులు వీరిని కూలీ పనులకు పిలుస్తుంటారు. దీనిలో భాగంగా సకల కొత్తపల్లి గ్రామంలో వరినాట్లు వేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. వసంతవాడ నుంచి టాటా మేజిక్ వాహనంపై వరినారును లోడ్ చేసి వ్యాన్‌పై కూర్చుని సకలకొత్తపల్లి గ్రామానికి వెళ్తున్నారు. తరలించే క్రమంలో వ్యాన్‌పై కూర్చుని ఉన్న వ్యక్తి పైకి లేచి నిల్చోవడంతో రహీమ్ తలకు విద్యుత్ తీగలు తగిలాయి. వెంటనే అతను రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ తెలిపారు.

మద్యం మత్తులో డెటాల్ తాగిన వ్యక్తి మృతి

సాక్షి, భీమవరం: నర్సయ్య అగ్రహారానికి చెందిన ఎం.పెద్దిరాజు (50) అనే వ్యక్తి మద్యం మత్తులో డెటాల్ తాగి మరణించినట్లు వన్‌టౌన్ ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఉదయం నుంచి మద్యం తాగుతూ ఉన్నాడని, మత్తులో డెటాల్ తాగాడన్నారు. చికిత్స నిమిత్తం ఏలూరులోని జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ శ్రేణులు


చెక్కపల్లిలో తెదేపా శ్రేణుల్ని పార్టీలో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్

ముసునూరు: జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధి, పురోగతి కోసం క్రమశిక్షణతో పట్టుదలగా, నిరంతరం శ్రమించాలని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. చెక్కపల్లి గ్రామంలోని ఏడు కుటుంబాలకు చెందిన 50 మంది తెదేపా గ్రామ నేతలు, కార్యకర్తలు కాటేపల్లి రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, కాటేపల్లి వరప్రసాద్, మండలపు దుర్గారావు, నక్కా నాగరాజు, రాజకుమార్, కుప్పాల ఆంత్రోజు తదితరులు మండలపార్టీ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. అంతకు చెక్కపల్లిలో భారీ బైక్ ర్యాలీ రోడ్ షో నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు కె.రాజానాయన, పి.గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, ఎంపీటీసీ తోట రమాదేవి మురళీ, ఉప సర్పంచ్ పద్మజా దేవేంద్ర, సచివాలయ కన్వీనర్ టి.వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారులు



ఏలూరు వైఎంహెచ్‌ఏ హాలులో నర్తన బాల అవార్డుల ప్రదానోత్సవం ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఏలూరుకు చెందిన అభినయ నృత్య భారతి సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డీ.హేమసుందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నృత్య రూపకాల ద్వారా పౌరాణిక గాథలను కళ్లకు కట్టినట్టు ప్రదర్శించడం కూచిపూడి నృత్యకళకే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చి నృత్యాలు ప్రదర్శించి అలరించిన చిన్నారులను నర్తన బాల అవార్డులతో సత్కరించారు. -ఏలూరు (ఆర్ఆర్‌పేట)

రేషన్ బియ్యం స్వాధీనం


పెదపాడు మండలంలోని కలపర్రు టోల్‌గేట్ వద్ద రేషన్ బియ్యంతో పెదపాడు ఎస్సై

పెదపాడు: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రైస్‌ను పెదపాడు పోలీసులు స్వాధీనం చేసుకుని లారీని సీజ్ చేశారు. పెదపాడు పోలీసుల వివరాలు ప్రకారం.. విజయవాడ వైపు నుంచి కాకినాడకు వెళ్తున్న ఐషర్ లారీలో పీడీఎస్ రైస్ తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. 13 టన్నుల బియ్యం తరలిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో ఐషర్ వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్ వెంకట సాయికుమార్, బియ్యం యజమాని చిత్తూరి హరిబాబు, లారీ ఓనర్ కాట్రపు రెడ్డి వీరబాబులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

అభయ గణపతికి పంచామృతాలతో అభిషేకాలు



అభయ గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రావణ బహుళ చవితి పురస్కరించుకొని పట్టణంలోని రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో ఆదివారం అభయ గణపతికి పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. సహస్రనామార్చన, వ్రతం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్ రాజు పర్యవేక్షించారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన



తణుకులో నిరసన ధర్నా నిర్వహిస్తున్న నాయకులు


తణుకు: దేశ స్వాతంత్ర్యాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీకి పాలించే అర్హత లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ అన్నారు. ఆదివారం తణుకు నరేంద్ర సెంటర్‌లో మోదీ భారి నుంచి దేశాన్ని రక్షించాలని కోరుతూ మానవహారం నిర్వహించి నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ 76వ స్వాతంత్ర్య దినోత్సవంలోకి దేశం అడుగుపెడుతున్నప్పటికీ కులం, మతం, ప్రాంతం పేరుతో పాలకులు ఘర్షణలు సృష్టించడం సిగ్గు చేటన్నారు. నూతన టెక్నాలజీతో ఆధునిక ప్రపంచం వైపు సాగుతున్న తరుణంలో అనాగరిక పద్ధతులతో కొన్ని శక్తులు వెనక్కు తీసికెళుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అడ్డగర్ల అజయ కుమారి, కామన మునిస్వామి, ఎస్.ఆదినారాయణబాబు, కె.అయ్యప్ప, శ్రీనివాసరాజు, వైటీ రామకృష్ణ, బంగారమ్మ, పి.శారద తదితరులు ఆధ్వర్యం వహించారు.

ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సంతాపం

తణుకు టౌన్: తెలంగాణ పాటకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిన ప్రజా గాయకుడు గద్దర్ అని, గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు, హక్కుల ఉద్యమాలకు తీరని లోటని సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపకుడు పేరూరి మురళీకుమార్ సంతాపం తెలిపారు. ఆదివారం తుది శ్వాస విడిచిన గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్‌రావు అని, బౌద్ధాన్ని విశ్వసించే గద్దర్ విప్లవోద్యమానికి, దళితోద్యమానికి, ముఖ్యంగా తెలంగాణా ఉద్యమానికి తన పాటల ద్వారా గొంతుకనివ్వడమే కాకుండా ఆయా ఉద్యమాల్లో ఆయన స్వయంగా పాల్గొన్నారని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే ప్రజా ఉద్యమాల కర్తవ్యమని పలువురు సామాజిక న్యాయ పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు.

తణుకు: ప్రజా గాయకుడు, విప్లవ కవి గద్దర్ మృతికి సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తీవ్ర సంతాపాన్ని తెలిపారు. గద్దర్ సామాజిక ఉద్యమాలకు, ప్రజా పోరాటాలకు తీరని లోటుగా భీమారావు పేర్కొన్నారు. గద్దర్ స్ఫూర్తితో ఎంతో మంది విప్లవ గాయకులు వచ్చారని అన్నారు. తన పదునైన జానపద సాహిత్యంతో ప్రజల్లో ఉత్తేజాన్ని నింపి సామాజిక, ఆర్థిక అసమానతలు రూపుమాపడానికి సామాజిక న్యాయ సాధనకు ఎంతగానో కృషి చేశారన్నారు.

నేడు రైతుల ధర్నా విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తణుకు: రైతులు, కౌలు రైతులకు ప్రతి ఎకరాకు సాగు పెట్టుబడిగా రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించాలని కోరుతూ ఈనెల 7న రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో తలపెట్టిన రైతుల ధర్నా విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. ఆదివారం తణుకు సురాజ్యభవన్‌లో రైతుల ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ వ్యవసాయ సాగుపెట్టుబడి వ్యయం బాగా పెరిగి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, నెక్కంటి క్రాంతి కుమార్, సికిలే పుష్పకుమారి, టి.అప్పలస్వామి, జిల్లా సమితి నాయకులు నామన వెంకటేశ్వరరావు, మండల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో నవోదయం

- గ్రామాల్లో వ్యవసాయ విప్లవం
- ప్రభుత్వ సహాయ, సహకారాలన్నీ గ్రామాల్లోనే
- వేగంగా ఆర్బీకే భవన నిర్మాణ పనులు
- పలు గ్రామల్లో విస్తృత సేవలు



రైతుల సేవలకు సిద్ధంగా ఉన్న దర్శిపర్రు ఆర్బీకే కేంద్రం



పరిమెళ్ల రైతు భరోసా కేంద్రం

పెంటపాడు: పెట్టుబడి సాయంతో పెరిగిన రైతు పరపతి, రైతే రాజు అనేది దశాబ్దాలుగా నెరవేరని నినాదంలా ఉండిపోయింది. కానీ ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ నిజంచేసి చూపించారు. అదే వరవడిలో మరో నాలుగడుగులు ముందుకు వేసి యావత్తూ మన రాష్ట్రంవైపు చూసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. రాష్ట్రంలో ఆయన నేతృత్వంలో వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతు భరోసా పేరుతో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు. రైతులను వ్యవసాయ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వ్యవసాయ సిబ్బందిని, వ్యవసాయ గ్రంథాలను అందుబాటులో ఉంచుతూ రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతులకు అండగా, ఆసరాగా నిలుస్తున్నారు. వైఎస్సార్ భరోసా కింద ఈ ఏడాదిలో మండలంలో 8,500 మంది రైతులకు ఇప్పటివరకు రైతుభరోసా కింద నాలుగు విడతల్లో రూ. 53 కోట్లు(సుమారు)అందించారు. యంత్రసేవా పథకంలో భాగంగా 17 గ్రూపులకు రూ. 2 కోట్లు విలువైన యంత్రాలు అందించారు. గ్రామస్థాయిలోనే రైతులకు అండగా గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఏ చిన్న అవకాశం వచ్చినా రైతులు మండల కేంద్రం వద్దకు రావాల్సి వచ్చేది. నేడు జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలోనే రైతుల వద్దకు అవసరమైన అన్ని సేవలు వచ్చి చేరాయి.పెంటపాడు మండలంలో 20 ఆర్బీకేలు ఉన్నాయి. వీఏఏల ద్వారా సాగులో సూచనలు సలహాలు అందించడంతో పాటు, ఈ– క్రాఫ్ నమోదు, పంట నష్టం వస్తే వెంటనే అంచనావేసి ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు చర్యలు తీసుకొంటున్నాం. ఆర్బీకేల్లో సిబ్బంది రైతులకు అవసరమైన వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందిస్తున్నారు. భూసార పరీక్షలు చేయించడం, పంట బీమా వంటి పనులు చేపడుతున్నారు. పశువుల బీమా, వైద్య సహాయం, వాటికి కావాల్సిన సంపూర్ణ దాణా వంటి సేవలు అందించడంలో ఆర్బీకేలు విశేషసేవలు అందిస్తూ పాడి రైతులకు అండగా నిలుస్తున్నాయి.

మాట నిలుపుకున్నారు



ప్రజాసంకల్పయాత్రలో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని జగనన్న మాటిచ్చారు. ఆ మాట ప్రకారం గత నాలుగేళ్లుగా ఆర్థిక సాయం అందించారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికి ముందుగానే రైతుల ఖాతాలకు జమ చేశారు. రైతుల కష్టాలు తెలుసుకొని సాగుకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఏటా రైతులకు అందిస్తున్న రూ. 18,000 పెట్టుబడి సాయం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– దేవ వెంకటరమణ, రావిపాడు వ్యవసాయ సహకార సంఘ చైర్మన్

పెట్టుబడి సాయం అందిస్తున్నారు



అకాల వర్షాలలో పంట నష్టపోయిన రైతులకు స్థానిక నాయకుల సహకారంతో లంచానికి తావు లేకుండా రైతు ఖాతాల్లో ప్రభుత్వం నష్టపరిహారం కింద అందిస్తున్న సొమ్ములు జమ అవుతున్నాయి. రైతులను కంటికి రెప్పలా కాపాడుతున్నాం అని గత ప్రభుత్వాలు చెప్పాయి కానీ ఆ ప్రభుత్వాన్ని ఇప్పుడే చూస్తున్నాం. నిజంగా రైతు రాజు అనే నానుడి నిజం అవుతుందన్న నమ్మకం ఉంది.

– గన్నిన వెంకట్రావు రైతు, కొండేపాడు

కంటికి రెప్పలా కాపాడుతున్నారు



రైతుల కోసం అదిచేస్తాం, ఇది చేస్తాం అని చెప్పడమే కానీ రైతులను కంటికి రెప్పలా కాపాడుతున్న ప్రభుత్వాన్ని ఇప్పుడే చూస్తున్నాను. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతులను ఆదుకుంటున్న తీరు చూస్తుండే నిజంగా రైతు రాజులా నిలబడతారనే నమ్మకం కలుగుతోంది.

– కె. పార్థసారథి, మండల వ్యవసాయాధికారి, పెంటపాడు

ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటరమణ



తణుకు: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నేలపాటి వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమవరం పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయ సంఘం జిల్ల శాఖ ఎన్నికల్లో వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అత్తిలి మండలం మంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న వెంకటరమణ 2019లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. 2021లో రాష్ట్ర విద్యాపరిశోధన మండలి ఆధ్వర్యంలో ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తక రచయితగా పని చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణను పలువురు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

60మంది వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతీ ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా 60 మందికి ఉచిత వైద్యసేవలు అందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం సంచార వైద్య శాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలుమహేంద్రలు సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, పాలంగి, కానూరు గ్రామాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. దాత అనుమోలు సుబ్బారావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, ఆర్జీ బాస్కరరావు పాల్గొన్నారు.

రైల్వే ఆస్తులను కాపాడుకుంటూ ముందుకెళ్లాలి

పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి



కార్యక్రమానికి హాజరైన నాయకులు, ప్రజలు

తాడేపల్లిగూడెం: రైల్వే స్టేషన్ల అభివృద్ధి కార్యక్రమానికి పెద్దపీట వేసినందుకు ప్రధాని మోదీకి ప్రత్యేక అభినందనలు అని, ప్రజావసరాలను తీరుస్తున్న రైల్వేను కాపాడుకుంటూ ముందుకు సాగాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం స్టేషన్ అభివృద్ధి కార్యక్రమం ఆదివారం గూడెం స్టేషన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి కారుమూరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధి పథకంలో నడిపేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని బీజేపీ, ఇతర నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు మంత్రి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

రూ.27.13 కోట్లతో అభివృద్ధి పనులు

గూడెం రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ లో భాగంగా రూ.27.13 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్లాట్‌ఫాంల అభివృద్ధి, ప్రీమియం మాడ్యులర్ మరుగుదొడ్లు, వెయిటింగ్ హాల్, గ్యాంగ్‌వే, ఎస్కలేటర్లు, ఎలక్ట్రికల్ లైటింగ్ వంటివి ఏర్పాటు చేస్తారు. ఆధునిక హంగులతో స్టేషన్ ముఖద్వారాన్ని మార్చనున్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులతో పాటు, బీజేపి నాయకులు ఈతకోట తాతాజీ, ముప్పిడి సురేష్‌రెడ్డి, కోట రాంబాబు, ఐనం బాలకృష్ణ, టి.బోగేశ్వరరావు, రాంబాబు, అయినంపూడి శ్రీదేవి, వెంకటలక్ష్మి, రైల్వే యూనియన్ నాయకులు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కుల, మత, రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- నందమూరులో గడపగడపకు మన ప్రభుత్వం



తాడేపల్లిగూడెం మండలం నందమూరు గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: కుల, మత, రాజకీయ, పార్టీలకతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం నందమూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పేరుతో తూరలు వేసి మురుగునీటి వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. దీంతో ప్రజలు బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రజలు కోరుతున్నారన్నారు. టీడీపీ దోపిడీకి ప్రజలు ఏ విధంగా ఇబ్బంది గురవుతున్నారో స్పష్టమవుతుందన్నారు. జగన్ పాలనలో అందుతున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. సమర్థవంతమైన పాలన అందిస్తుంటే ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు రాష్ట్రమంతా అలజడి సృష్టించి లా అండ్ ఆర్డర్‌ను పాడు చేయడానికి కుట్రపూరితంగా ఆలోచిస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎమ్పీటీసీలు వీర్లపాటి జ్యోతి, మార్లపూడి సుబ్బారావు, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, ఏవో ఆర్ఎస్.ప్రసాద్, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, గ్రామస్తులు కోనేటి దానయ్య, యామని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమృత్ భారత్‌లో విశాఖ డివిజన్ :

దేశంలో రూ.508 కోట్లతో రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులను వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని, ఈ సందర్భంగా తుని రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో విశాఖ రైల్వే డివిజన్ వెంటనే ఏర్పాటు చేయాలని తాను కోరడం జరిగిందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం, భీమవరం, నర్సాపురం, నిడదవోలు రైల్వే స్టేషన్‌లలో అమృత్‌భారత్‌లో భాగంగా ఆధునీకరణ పనులు జరగనున్నాయన్నారు.

గద్దర్ మృతికి సంతాపం

ప్రజా గాయకుడు గద్దర్ మృతికి ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజా ఉద్యమాల్లో అలుపెరుగని పోరాటం చేశారని నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కడకట్లలోని జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో ఆదివారం క్లబ్ అధ్యక్షుడు వంగపండు రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ రెటినోపతి కంటి వైద్య శిబిరం జరిగింది. నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి సీనియర్ లయన్ పదం కుమార్‌గుప్తా ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి క్లబ్ నిర్వహించే కంటి వైద్య శిబిరాలకు అయ్యే ఖర్చు మొత్తం దాతగా భరిస్తానని చెప్పారు. క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలకు క్లబ్ సభ్యులను అభినందించారు. 54 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. తదుపరి పరీక్షల నిమిత్తం 14 మందిని నిడదవోలు ఆసుపత్రికి పంపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, రీజనల్ చైర్‌పర్సన్ మదన్‌మోహన్ అగర్వాల్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పచ్చ వెంకటేశ్వరరావు, సుంకర శ్రీనివాస్, ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో జాబ్ డ్రైవ్

సాక్షి, భీమవరం: నేషనల్ కెరియర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) ఆధ్వర్యంలో జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీన నర్సాపురం వైఎన్ డిగ్రీ కళాశాల, 9న భీమవరం డీఎన్నార్ డిగ్రీ కళాశాలల్లో ఈ జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జాబ్ డ్రైవ్ నందు కస్టమర్ సపోర్ట్, బీపీఓ వాయిస్ ప్రాసెస్ వంటి ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఏదైనా డిగ్రీ చదివిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు సెల్ : 93935 75353 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మహనీయుల ఆశయాలను సాధిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, జగ్జీవన్ ఆశయ సాధనకు దళిత సేన కృషి చేస్తుందని వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ అన్నారు. పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో ఆదివారం దళిత సేన జిల్లా అధ్యక్షుడు చీలి మోహన్‌రావు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. తాడేపల్లిగూడెం పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడిగా సందక రమణని ఈ సందర్భంగా రవి ప్రకాష్ నియమించారు. నియామక పత్రాన్ని అందించారు. రమణను ఈ సందర్భంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు, రాష్ట్ర కార్యదర్శి షేక్ సయ్యద్ బాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

దప్పు కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలి

పెంటపాడు: అర్హులైన డప్పు కళాకారులకు, చర్మ కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయాలని దళిత సేన విజ్ఞప్తి చేసింది. మండలంలో జిల్లా దళిత సేన అధ్యక్షుడు చీలి మోహనరావు అధ్యక్షతన పెంటపాడు కునాకరపేటలో ఆదివారం సమావేశం నిర్వహించారు. దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ పాల్గొని రాష్ట్రంలో ఉన్న చర్మకారులైన డప్పు కళాకారులకు, లెదర్ వర్కు చేసే కార్మికులకు ఫించన్లు ఇవ్వాలన్నారు. పెంటపాడు మండల దళిత సేన అధ్యక్షు డిగా చదలవాడ శ్రీని వాస్‌కు నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దళితసేన రాష్ట్ర కార్యదర్శి షేక్ సయ్యద్‌బాజీ, సందక రమణ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఉండి: పౌష్టికాహారంతో తల్లీబిడ్డ ఆరోగ్యం ఉంటారని యండగండి సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి అన్నారు. ఆదివారం గ్రామంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ దత్తాల సుజాతా రాణి, సీడీపీఓ వాణీ విజయనిర్మల, సూపర్‌వైజర్ నిర్మల, అంగన్వాడీ వర్కర్లు మానుకొండ మరియమ్మ, చాపల ఎలీషా, తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు ఘటనపై వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం



తణుకు నరేంద్ర సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఇరగవరంలో చంద్రబాబు దిష్టి బొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తణుకు అర్బన్: పుంగనూరులో పోలీసులపై టీడీపీ గూండాల దాడికి నిరసనగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు తణుకు నరేంద్ర సెంటర్‌లో ఆదివారం ప్రతిపక్షనేత చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య మాట్లాడుతూ టీడీపీ గూండాలు పోలీసులపై దాడికి దిగడం అమానుషమని అన్నారు. చంద్రబాబు, లోకేష్‌ల బహిరంగ సభల్లో ఎక్కడా కూడా శాంతి భద్రతలకు ఆటంకం కలుగకుండా పూర్తిస్థాయి భద్రత కల్పిస్తున్నారని అయినప్పటికీ పోలీసులపై దాడికి దిగి రక్తం చిందేలా దాడులకు పాల్పడడం బాధాకరమన్నారు. దాడికి ముందు చంద్రబాబు టీడీపీ నాయకులను రెచ్చగొట్టే ధోరణిలో ప్రసంగించి దాడికి ఉసిగొల్పినందుకు చంద్రబాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడికి దిగిన చరిత్ర గతంలో ఆంధ్రప్రదేశ్‌లో లేదని చంద్రబాబునాయుడు ఇటువంటి మారణ కాండకు దిగజారడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, పట్టణ జేసీఎస్ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్, ములగాల శ్రీను, కుడుపూడి చంద్రరావు, పుల్లెపు సూరిబాబు, మణికంఠరెడ్డి, కారుమంచి యోహాన్, డోలా సింహాద్రి, కొమ్మోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలు

ఇరగవరం: చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడుగా ఉండటం దురదృష్టకరమని డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు అన్నారు. ఇరగవరం గ్రామంలో ఆదివారం ప్రతిపక్ష నేత టీడీపీ అధ్యక్షుడు అధ్వర్యంలో పుంగనూరులో జరిగిన ఘటనకు నిరసన తెలిపి చంద్రబాబు దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రి చేసి వ్యక్తి యువతను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం బాధకరమన్నారు. ప్రతిపక్ష నాయకుడు హుందాగా ఉండాలన్నారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు చవ్వాకుల శ్రీనివాస్, నాయకులు చోడే జోషి, దినేష్ రెడ్డి వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా హింసాకాండపై వైఎస్సార్ సీపీ నిరసన

అత్తిలి: చిత్తూరు జిల్లాలో చంద్రబాబు పర్యటన సందర్భంగా జరిగిన హింసా కాండపై మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. చిత్తూరులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు దమన కాండను సృష్టించారని పార్టీ నాయకులు ఆందోళన చెందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసుల వాహనాలను దహనం చేసి వారిని గాయాలపాలు చేశారని మండల వైఎస్సార్ సీపీ నాయకులు పైబోయిన సత్యనారాయణ అన్నారు. తల్లకిందులగా తపస్సు చేసిన చంద్రబాబు సీఎం కాలేడన్నారు. ఈ సందర్భంగా టీడీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు హబిబుద్దిన్, అత్తిలి ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, గంటా నాగరాజు, దిరిశాల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.